క్లుప్తంగా

బీఈడీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

భద్రాచలం: భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బీ.ఎడ్ కళాశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆడి పాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీరనాయక్ పండగ విశిష్టతను వివరించారు.

టీ హబ్ పరీక్షల తేదీలివే..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీ హబ్‌లో నిర్వహించే అన్ని రకాల పరీక్షల అక్టోబర్ నెల తేదీలను డాక్టర్ పుల్లారెడ్డి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 4, 8, 11, 14, 15, 17, 19, 22, 24, 26, 29 తేదీలలో అన్ని రకాల పరీక్షలు చేయబడతాయని తెలిపారు. మండల ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

డీఈఈ బాధ్యతలు స్వీకరణ



అశ్వారావుపేట రూరల్: ఐటీడీఏ సబ్ డివిజన్ అశ్వారావుపేట నూతన డీఈఈగా బాపనయ్య గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో హెచ్‌డీగా పని చేస్తున్న ఆయనకు డీఈఈగా పదోన్నతి లభించగా, అశ్వారావుపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ డీఈఈగా పని చేస్తున్న రాంరెడ్డి నాలుగు రోజుల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. విధుల్లో చేరిన తర్వాత మండలంలోని గుర్రాల చెరువు, వేదాంతపురం, మొద్దులమడ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో ఐటీడీఏ నిధులతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయాలను పరిశీలించారు. నూతన డీఈఈకు స్థానిక ఏఈఈ ప్రసాద్‌తోపాటు సిబ్బంది కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యం

కరకగూడెం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటడమే తమ ముందున్న లక్ష్యమని ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చైర్మన్ కంటే కేశవ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాగంగా జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నామన్నారు. కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులను కలుసుకుని దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ పునేం నరేష్ నాయకులు ఊకె.ముత్తయ్య దొర, అంబోజీ బుద్దయ్య, కుక్కల నాగేశ్వరరావు గౌడ్, వెంకన్న, నాగ పుల్లారావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ



న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

భద్రాచలంటౌన్: మదనపేట పోలీస్ సిబ్బంది న్యాయవాది మహమ్మద్ అబ్దుల్ కరీంపై దౌర్జన్యానికి నిరసనగా గురువారం భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులోని న్యాయవాదులు విధులను బహిష్కరించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. న్యాయమూర్తి మీసాల వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం మాట్లాడుతూ.. న్యాయవాదిపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి దాడి చేయడం సరి కాదన్నారు. ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాస చారి, ఉపాధ్యక్షుడు ఎంవి.రమణ, జాయింట్ సెక్రటరీ విద్యాధరి, కోశాధికారి బండారు రమేష్, లైబ్రరీ సెక్రెటరీ పేరాల వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు కె.విద్యాసాగర్, ప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆదినారాయణ, అరుణ శ్రీ, నర్మద, ప్రకాష్, సత్యనారాయణ, సతీష్, మల్లేష్, తరుణి, రమేష్, సురేష్, శారద, మాధవి, అంజలి, రవితేజ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

మణుగూరురూరల్: పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకుని దోమల వ్యాప్తిని అరికట్టాలని మణుగూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ స్వరూప సూచించారు. గురువారం మండలంలోని పలు ప్రాంతాల్లో పిహెచ్‌సి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విహెచ్‌ఎస్‌ఎన్‌సి సమావేశం, వైద్యశిబిరం నిర్వహించి ప్రజలకు, షుగర్, బీపీ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, రమాదేవి, ప్రభావతి, రాధ, లక్ష్మి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- ఆలయాలు, మండపాల్లో విగ్రహాల ప్రతిష్ఠ
- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



అన్నపురెడ్డిపల్లి: శ్రీబాలాజీ ఆలయంలో ఆదిలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు..

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలతో పాటు పలు కాలనీల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవాలను ప్రారంభించారు. సుందరయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కుంటా లక్ష్మణ్ దంపతులు అమ్మవారి విగ్రహాన్ని అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గుట్టమల్లారం గ్రామపంచాయతీలోని శ్రీపంచముఖ వేదగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు వట్టం రాంబాబు, కత్తి రాము, మడి వీరన్నబాబు, వద్లూరి రాంబాబు, జక్కం రంజిత్, దాసరి వెంకట్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీ ఆలయాలతో పాటు మండపాలలో శ్రీదుర్గామాత శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమైన్నాయి. భక్తులు డప్పు చప్పుళ్లు, బాణాసంచా ధ్వనుల నడుమ దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, శాంతినగర్ కాలనీలోని లలిత పరమేశ్వర దేవాలయంలోని అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారి విగ్రహాలు కొలువుదీరగా, భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని నారంవారిగూడెం (శ్రీరంగాపురం)లోని విజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజలతో ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త దంపతులు బండి పుల్లారావు, చలమావతి దంపతులు దీక్షాధారణ చేపట్టి అమ్మవారికి విశేష పూజలు చేశారు. కొత్త మామిళ్లవారిగూడెంలో గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. విగ్రహ ప్రతిష్ఠ చేసి కుంకుమ పూజలు చేశారు. అన్ని గ్రామాల్లో మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ములకలపల్లి: మండలవ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. మండలకేంద్రంలోని భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలోనూ, ఉమాపృథ్వీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలనూ గురువారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. తొలిరోజు బాలా త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు ఆదిలక్ష్మి అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మ వార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బూర్గంపాడు: మండల వ్యాప్తంగా శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బూర్గంపాడు, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక, మోరంపల్లిబంజర, లక్ష్మీపురం గ్రామాలలో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చి ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

చర్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన ఉత్సవ పందిళ్లలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాయి. ఉత్సవ కమిటీలు మండపాలను భారీ ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరించాయి.



ములకలపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని తోడ్కొని వస్తున్న భక్తులు



అశ్వారావుపేటరూరల్: మామిళ్లవారిగూడెంలో గ్రామ దేవతకు జలాభిషేకం చేస్తున్న మహిళలు



భద్రాచలంటౌన్: బాలా త్రిపుర సుందరిగా..



చర్లలో కొలువుదీరిన అమ్మవారు



అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



బూర్గంపాడు: సారపాక గాంధీనగర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు



మణుగూరురూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న విగ్రహదాత, నాయకులు

ఆపరేటర్లకు అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ చంద్రశేఖర్

మణుగూరుటౌన్: గ్రామ స్థాయిలో పనిచేసే పంపు ఆపరేటర్లు తాగునీటి సరఫరాతో పాటు చిన్నపాటి మరమ్మతులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని మిట్టగూడెం రథంగుట్ట సమీపంలోని హాల్‌లో మణుగూరు మిషన్ భగీరథ విభాగం గ్రామ తాగునీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నీర్ జల్'కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో పనిచేసే పంప్ ఆపరేటర్లకు ట్రెనింగ్ ఇచ్చి చేతి పంపులు రిపేర్లు, పైప్ లీకేజీలతో పాటు మోటార్ మరమ్మతులు, ఇంటి కనెక్షన్‌లు మరమ్మతులు స్వయంగా చేసుకునే విధంగా ఈ శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈ పి.మహేందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మండల పరిషత్ అధికారి శ్రీనివాసరావు, మండల ఏఈ అరుంధతి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ముంపు గ్రామాల మహిళలు

మణుగూరురూరల్: ఆగస్టు 31వ తేదీన కురిసిన భారీ వర్షానికి వచ్చినవ రదల కారణంగా ముంపు గురైన సర్వం కోల్పోయిన బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మండల పరిధిలోని పగిడేరు, శాంతినగర్ గ్రామ మహిళలు గురువారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ రాఘవరెడ్డికి సమస్యను వివరిస్తూ.. అకాల వర్షానికి తామంతా తీవ్రంగా నష్టపోయామని, ఆనాటి నుండి తామంతా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలకు నష్టపోయిన తమకు నేటి వరకు తమకు ఎలాంటి పరిహారం అందలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన తమకు పరిహారం అందించాలని కోరారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

వాగు తీరం.. ప్రకృతి అందం!



వాగు తీరాన సూర్యాస్తమయ దృశ్యం..

కరకగూడెం: సూర్యుడు మబ్బుల మధ్య నుంచి వెలుగుతున్నట్లుగా కనిపిస్తూ పొడవైన గడ్డి మొక్కలు గాలికి అటూ ఇటూ కదులుతూ కనిపిస్తున్న ఈ దృశ్యం కరకగూడెం పెద్దవాగు తీరం వద్ద కనిపించింది. అందమైన ఈ దృశ్యం నీటి అద్దంలో సూర్యుడు ప్రతిబింబిస్తున్నట్లు కనిపించి పలువురిని కట్టిపడేస్తోంది. ప్రకృతి ఎంతో అద్భుతంగా ఉంటుంది అనడానికి ఈ చిత్రం ఉదాహరణగా నిలుస్తోంది. సూర్యాస్తమయం సమయంలో ఈ దృశ్యాన్ని 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

ఎమ్మెల్యేలకు మద్దతుగా నిలవాలి

భద్రాచలంటౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడే దళిత ఎమ్మెల్యేలకు మద్దతుగా నిలవాలని మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు దేగల శివ అన్నారు. పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాలల ఐక్యత కోసం వర్గీకరణను వ్యతిరేకిస్తున్న పెద్దపల్లి వివేక్ వెంకటస్వామితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజును ఇబ్బందులకు గురిచేసే కుట్రలు జరుగుతున్నాయని, వారి జోలికొస్తే రాష్ట్రంలోని మాలలంత ఏకమై ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేగల రాజు, పుట్టి రవి, సాత్విక్, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులసాని రాంరెడ్డి కుమారుడు పులసాని మహేష్‌రెడ్డి మృతి చెందటంతో గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మహేష్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ములకలపల్లి: పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. బుగ్గా వెంకట నర్సమ్మ అధ్యక్షతన గురువారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపులో అశ్రద్ధగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దుబ్బా ధనలక్ష్మి, మండల కన్వీనర్ నిమ్మల మధు, వర్కా రుక్మాంగధర రావు, ఎస్‌కె.మస్తాన్, సాయిరత్న, గంటా శ్రీను, పద్దం తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



పినపాక: భూపాలపట్నం గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న పాయం

పినపాక: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, నాయకులు పనిచేయాలని పినపాక ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన సుమారు 70 లక్షల భయంతో నిర్మించిన పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం బయ్యారం పంచాయతీలోని బయ్యారం సాయి బాబా గుడి దగ్గర నుంచి రాయి గూడెం వరకు సుమారు రెండు కోట్ల 20 లక్షలు వ్యయంతో నిర్మించనున్న బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వెనకబడిన గ్రామాలకు కూడా రహదారి ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దసరా నుంచి అర్హులైన పేదలందరకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని అన్నారు. అనంతరం బయ్యారంలో గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రామనాథం, వివిధ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి..

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టి భగత్‌సింగ్ నగర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే కార్యక్రమానికి హాజరై ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ కార్డు ప్రతి కుటుంబం పొందాలన్నారు. రేషన్‌కార్డు ఉన్నవాళ్లు లేని వాళ్లు అనే తారతమ్యం లేకుండా సర్వేకు వచ్చే అధికారికి ప్రతి కుటుంబం వివరాలు అందించి సహకరించాలన్నారు. అధికారులు తహసీల్దార్ రాఘవరెడ్డి, కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు శివ, సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, మధు, రెహమాన్, పెనుగొండ సాంబ, మహిళా నాయకురాళ్లు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'పైలట్ ప్రాజెక్టు'లోనూ వివక్షేనా?

- డిజిటల్ కార్డు సర్వేకు నోచుకోని అశ్వారావుపేట

అశ్వారావుపేటరూరల్: ఒకే కార్డుతో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీకి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీంట్లో భాగంగానే నియోజకవర్గంలోని ఒక పట్టణ ప్రాంతం, మరొకటి గ్రామీణ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక సర్వే చేపట్టాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఈ ఆదేశాలకు విరుద్ధంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు సర్వే ప్రాంతాలను ఎంపిక చేయడం ప్రస్తుతం చర్చనీయశంగా మారింది. దమ్మపేట మండలంలోని అల్లిపల్లి, ములకలపల్లి మండంలలోని ముత్యాలంపాడు గ్రామాలను ఎంపిక చేశారు. అంటే రెండు గ్రామీణ ప్రాంతాలే ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రామీణ కోటా కింద రెండింట్లో ఒకదానికి అవకాశం కల్పించి, పట్టణ కోటా కింద అశ్వారావుపేటను ఎంపిక చేయాల్సి ఉండగా వివక్ష చూపించినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటపై గత ఎమ్మెల్యేలానే, తాజా ఎమ్మెల్యే కుడా తన సొంత మండలమైన దమ్మపేటకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేరుకే నియోజకవర్గ కేంద్రంగా ఉందని, కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలు, నామినేట్ పదవులు కుడా దమ్మపేటకే అధికంగా దక్కుతున్నట్లు ఇటు స్థానికుల్లో, అటు అధికార పార్టీ క్యాడర్‌లోనే అసంతృప్తి వ్యక్తం అవుతోంది. అలాగే దమ్మపేట మండలంలోని అల్లిపల్లి గ్రామంలో మంత్రి తుమ్మల ప్రధాన అనుచరుడు నివాసం ఉండటంతో, అతని మెప్పు కోసమే ఈ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కొద్ది రోజులుగా అల్లిపల్లి నాయకుడు స్థానిక ఎమ్మెల్యేపై అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం సాగుతున్న క్రమంలోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో మంత్రి అనుచరుడి గ్రామానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. కాగా, పట్టణ ప్రాంతం కింద స్థానిక అధికారులు అశ్వారావుపేట పట్టణ ప్రాంతాన్ని ప్రతిపాదించగా, మున్సిపాలిటీ హోదా లేదానే సాకుతో తొలగించి, రెండు కూడా గ్రామీణ ప్రాంతాలనే ఎంపిక చేయడం విశేషం.

రావణాసురుడి దహనానికి ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం..

చర్ల: దసరా నాడు రావణాసురుని దహన కార్యాకరమానికి సంబంధించి చర్లలో ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

పాతచర్లలోని శివాలయం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ సమీపంలోని గడికోట మైదానంలో ఇందుకు ఏర్పాట్లును చేపట్టారు. సుమారు 30 అడుగుల ఎత్తుల్లో రావణాసురుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దానిని దహనం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

డిజిటల్ కార్డు సర్వే షురూ



దమ్మపేట: అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

దమ్మపేట: మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించబడుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వే ప్రక్రియను, జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రేషన్ కార్డులో పేరు ఉండి మరణించిన వారి వివరాలను తొలగించి, కొత్త వారి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిపాల్గొన్నారు.

చర్ల: రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా నియోజకవర్గానికి రెండు ప్రాంతాలను ఎంపిక చేసింది. రూరల్ ప్రాంతంలో చర్ల మండలంలోని పులిగుండాల గ్రామ పంచాయతీ ఎంపికయ్యింది. అక్టోబర్ 3 నుంచి 7 లోపు ఎంపిక కాబడిన గ్రామ పంచాయతీలో పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉండగా జిల్లా అధికారుల అదేశాల మేరకు గురువారం చర్ల మండల అధికార యంత్రాంగం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో సర్వే చేపట్టింది. పులిగుండాల గ్రామ పంచాయితీని సందర్శించిన రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పులిగుండాల పంచాయతీ పరిధిలోని పులిగుండాల, కొండెవాయి, బక్కచింతలపాడు గ్రామాలలో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఉన్న 114 కుటుంబాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని ముత్యాలంపాడు జీపీ కేంద్రంలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటి సర్వేలో నిర్వహించారు. సర్వేలో తొలిరోజు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలు సేకరించారు. జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (నోడల్ ఆఫీసర్) టి.సునంద గ్రామాన్ని సందర్శించి, సర్వేను పరిశీలించారు. ఆర్ఐ భద్రు పాల్గొన్నారు.



చర్ల: పులిగుండాల గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



ములకలపల్లి: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

పోషణ మాసోత్సవాలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలోని నర్సాపురం రైతువేదికలో గురువారం పోషణ మాసోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నవ్యశ్రీ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సూపర్ వైజర్లు ధనలక్ష్మి, సౌమ్య, సుశీల, రాజేశ్వరి, పోషణ్ అభియాన్ బీసీ మౌనిక, వైద్య సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.